

# పగడమల్లెలు

యాజి

**పువ్వులే నా జీవితం, సంతోషం, సర్వస్వం. ఇలా అని నేనేదో అర్థం అయ్యీ కానట్టుగా ఉండే అందమైన పదాలను పేర్చి కవిత్వం చెప్పే భావుకురాలనుకునేరు! కాదు. నాకూ, పూలకీ ఉన్న అనుబంధాన్ని గురించి చెప్పాలంటే ముందు నా గతాన్ని గురించి కొంత మీరు తెలుసుకోవాలి.**

నా పుట్టుకతోనే నా జీవితం నిర్దేశింపబడింది, ఆ భగవంతునికి దాసీగా ఉండిపొమ్మని. నా తల్లే నాకు గురువై, నాట్యంతో పాటు నాకు అవసరమైన అన్ని విద్యలూ తన వారసత్వంగా నాకు అందించింది. నా తండ్రి గురించి నమ్మకంగా చెప్పలేనుగానీ, ఎవరో బాగా అందగాడు మాత్రం అయ్యుంటాడు. ఎందుకంటే నా రూపురేఖలూ, శరీర వర్ణమూ నా తల్లి నుంచి నాకు రాలేదు కాబట్టి.

దేవాలయానికి ఈశాన్య దిక్కులో చివరగా వుంటుంది మా ఇల్లు. ఇంటి చుట్టూరా పెద్ద పూలతోట. అందులో నాకు అత్యంత ప్రీతిపాత్రమైన పగడమల్లె పాదులతో పాటు, నీల సంపంగి, గులాబీ, సన్నజాజి, చేమంతి, బంతిలాంటి పూలమొక్కలు. ఉదయాన్నే నేను లేచి తోటంతా తిరిగి, పూలు కోయటం చూశాకే కోడి కూస్తుందేమోనని మా అమ్మ నన్ను ఆటపట్టిస్తూ ఉండేది. అదేమోగాని ఆ తోటలోని చెట్లే నాతో చిన్నప్పటి నుంచీ పెరిగీ, ఆటలాడీ, నన్ను ఆహ్లాదపరిచీ, నేను దుఃఖించినపుడు నన్ను ఓదార్చిన నేస్తాలు. ఎన్నో పగళ్లు, కొన్ని రాత్రులూ, అవే నాకు ఆశ్రయమిచ్చిన ఆప్తులు. తోటలోని పూలతో మాలలు కట్టి దేవుడిని అలంకరించటం, గుళ్లో శాస్త్రులవారి కథాకాలక్షేపం, నాట్యాభ్యాసం, ఇంటితోపాటు ఒంటిని కూడా సింగారించుకునే అభ్యాసంతో నా రోజులు గడచిపోయేవి.

నేను పెద్దమనిషిని కాగానే నాకు ఆ దేవుడితో వివాహం జరిపించి, ఆ పలకని రాతిబండే నా మొగుడన్నారు. నా తల్లికి కూడా అతడే మొగుడు కదా, నాకు వేరే ఎవరినైనా చూడమంటే, అపచారం అని చెప్పి లెంపలు వేసుకోమన్నారు. నా చిన్ని బుర్రలో పుట్టిన ఎన్నో ప్రశ్నలకు జవాబులు దొరకకపోగా, వాటికి శ్రోతలే కరువైనప్పుడు, మళ్లీ మా తోటలోని పూలచెట్లే నన్ను తాత్కాలికంగా సమాధానపరిచాయి. వయస్సూ, అనుభవమూ, పెరిగినప్పుడు సమాధానాలు దొరికాయి. ఆ పగడపుగొమ్మ జీవనవిధానాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకొన్నాక, వేరే దిక్కులేక, దానినే ఆలింగనం చేసుకుని, నిబద్ధతతో ఆచరించటం ప్రారంభించాను.

నా చిన్నప్పుడు నా అందం, నా నాట్యం చూసి నన్ను వలచి రాబోయే రసికుల గురించీ, నేను గడించబోయే ఐశ్వర్యం గురించీ తెగ కలలు కనేది మా అమ్మ. కాలక్రమేణా, నా స్థైర్యం, నా మాటల్లోని భావస్పష్టత, నా పోకడలోని ఒద్దిక, నా వ్యక్తిత్వంలోని గాంభీర్యం గమనించిన మా అమ్మ, నాకు భయపడకుండా నన్నెవరైనా చేరదీస్తారా అని చింతిస్తూ ఉండేది. కానీ అవే నాకు కవచమై నేను మనఃపూర్వకముగా కోరుకుంటే తప్ప, ఎవ్వరూ నాకు చేరువయ్యే అవకాశం లేకుండా చేశాయి.

చిన్నప్పుడు నన్నలరించిన ఈ తోటలోని పూలే, పెరుగుతున్న నా వయసుతో నా వొంటిలో పేరుకుంటున్న అందాలకి మరింత చేరువై నాతో గుసగుసలాడేవి, తమ రహస్యాలు తెలుసుకుని, తమను మరింత ఉప

యోగించుకొని, ఆస్వాదించుకొమ్మని. ఏ పూల పరిమళాలు, ఏ వేళల, ఏఏ అనుభూతులను ప్రేరేపిస్తాయి, శారీరక వాంఛలలోని గాఢతను ఏ పూలు ఎంతలా పెంచుతాయి, ఏ పూలు ఎంత అందంగా అలంకరింపబడిన వాతావరణంలోనైనా రసికతను పూర్తిగా సంహరిస్తాయిలాంటి రహస్యాలెన్నో నాకు నేర్పాయి. పగడమల్లెపూలను తలలో అలంకరించుకుని, నా హొయలు ఒలకబోసిన వేళ, నాకోసం తపించని మగాడు ఉండడని గ్రహించినా, నా మనస్సుకి అమితంగా నచ్చిన రసికుడికి, నేను ఆనందాన్ని ఇవ్వాలనుకునే సమయంలో తప్ప ఎప్పుడూ వాటిని వాడేదాన్ని కాదు.

అలా సంయమనం పాటిస్తున్నందుకేనేమో, ఆ పూలు నాకు మరింతగా సహకరిస్తూ, బాగా విరగకాస్తూ, మరింతగా గుబాళిస్తూ లోకం ఇంకా గుర్తించని విద్యలని కూడా నాకు నేర్పేవి. రాత్రి నా శయ్యపై అలంకరించిన ఆ పూలు, మర్నాడు ఉదయం, ఆ రాత్రి జరిగిన క్రీడావిశేషాలను నాకు కళ్లకు కట్టినట్లు, గాలిలో బొమ్మలుగా కదలి మరీ చూపిస్తున్నాయా అన్నంత విపులంగా చెప్పేవి.

నా పూల సువాసనతో పాటు నా పరిజ్ఞాన ప్రతిభ నెమ్మదిగా ఊరంతా పాకిపోయింది. ప్రతి ఇంటిలోనూ పూలమొక్కలు ఉన్నా, నేను పెంచుతున్న పూలలో ఏదో విశేష మహిమలున్నాయని పుకార్లు పాకటంతో, నాకు ఎదురుచూడని ఖ్యాతి లభించింది. నేను పూలతో మాట్లాడతాననీ, పూలు నేను చెప్పినట్లు వింటాయనీ, పూస్తాయనీ, ఇలా ఏవేవో చెప్పుకునేవారు నా గురించి.

గుడ్డిగా పాలింపబడుతున్న రాజ్యంలో, పేరున్నా, పెద్దగా ఎవరికీ తెలియని గ్రామమైన మా ఊరిని గురించి ఇక్కడ కొంత చెప్పుకోవాలి. ఇక్కడ గ్రామస్తులంతా ఒకరినొకరు ఎరిగి, సుఖాలు పంచుకుంటూ, కష్టాలలో చేయూతనిచ్చుకుంటూ, ఎన్నో తరాలుగా నివాసముంటున్న వాళ్లే. ఊరిని వదిలి వెళ్లే కుటుంబాలు ఎంత అరుదో, మా ఊరికొచ్చే కొత్త కుటుంబాలూ అంతే అరుదు. అటువంటి ఊళ్లో నా దగ్గరకు వచ్చే రసపోషకులు నాతో వారికున్న సాన్నిహిత్యాన్ని చిలవలు పలవలు చేసి దండోరా వేసుకునేవారు. ఊరెరిగిన ఒక సద్బ్రాహ్మణుడి విషయంలో మటుకు, అతడి వేడికోలు మేరకు, అతడూ, నేనూ కూడా చాలా జాగరూకతతో వ్యవహరించి, అతడి పేరు బయటకు రాకుండా చూసుకోవలసి వచ్చింది.

గుడి పక్క వీధిలోని అతడికి లంకంత ఇంటితో పాటు, ఒక ఇల్లాలూ, పిల్లలూ ఉన్నారు. నెలకోసారైనా నా దగ్గరకి చాటుగా ఎందుకు వచ్చేవాడో నేను ఎప్పుడూ అడగలేదు, ఆ రాబోయే సమాధానం ఏమిటో నాకు ముందరే తెలిసుండటం వల్ల. ఒకరోజు ఆ ఇంటి ఇల్లాలి నుంచి నాకు పిలుపొచ్చింది, ఒక్కసారి ఇంటికొచ్చి వెళ్లమని. నేనిచ్చే మహత్తు గల పూలకోసమో, లేక ఏదైనా విశేష కార్యాలంకరణల కోసమో, మరేదైనా సంసార సుఖానికి సంబంధించిన చిట్కాల కోసమో, ఇలాంటి పిలుపులు నా కలవాటైనా, అతడి ఇంటి నుంచి నేరుగా పిలుపు రావటంతో కొద్దిగా కలవరపడుతూనే వెళ్లాను. ఆ ఇల్లాలు నన్ను గుమ్మందాకా వచ్చి సాదరంగా ఆహ్వానించి, లోపలికి తీసుకెళ్లి అతిథి సత్కారాలు చేసి, తన మనసులో మాట చెప్పింది.

తన భర్త కొద్ది నెలలుగా సంసారం చేసే విషయంలో ముభావంగా ఉంటున్నాడనీ, తనెంత ప్రయత్నించినా తన పట్ల మునుపటిలాగా ఆకర్షితుడవ్వటంలేదని, ఏదైనా మార్గం చూపమని ప్రాథేయపడింది. తన బాధకు నేనే కారణమని, తెలియక నాతోనే మొరపెట్టుతున్న ఆమె అమాయకత్వానికి నాకు జాలివేసింది. నేను తనకు అక్కలాంటి దానినని తనను ఊరడించి, తన భర్తను రెండు రాత్రులు వరుసగా నావద్దకు పంపమని చెప్పాను. మూడోరోజు తరువాత, ఒక నెలపాటు, తన బిడ్డను పంపించి నా తోటలోని పగడమల్లెలు తెప్పించుకుని వాటితో రోజూ తనను అలంకరించుకోమని కూడా చెప్పాను. నా ఇంటికి వచ్చిన ఆమె భర్త ఆ రెండు రాత్రులూ, నా పూలపొడితో కలిపిన పాలుతాగి కోరిక నశించినవాడై, వెనుదిరిగి వెళ్లిపోయాడు. నెలరోజుల తరువాత తన సమస్య పరిష్కారం అవ్వటంతో ఆ ఇల్లాలు, నాకు దగ్గరై, ఎంతో ఆత్మీయతతో తన కష్టసుఖాలు నాతో పంచుకుంటూ ఉండేది.

నేను ఒకరోజు ఆమె ఇంటికి వెళ్లేసరికి, పక్కవాటాలోకి ఎవరో అతిథులు వచ్చినట్లున్నారు. అంతా హడావిడిగా ఉంది. ఒక బ్రాహ్మణ వితంతువు తన కుటుంబంతో కొద్దిరోజులపాటు వాళ్లింట్లోనే ఉండబోతోందన్న విషయం ఆమె మాటల ద్వారానే తెలిసింది. నన్ను ఆవిడకి పరిచయం చెయ్యటం ఇష్టంలేకో, లేక ఆ విషయం ఆవిడకు తలపుకు రాకో తెలియదు కానీ, ఆరోజు నేను ఆ కుటుంబాన్ని కలవకుండానే ఆ ఇల్లాలి దగ్గర శెలవు తీసుకొని బయటపడ్డాను. మర్నాడు, నేనెన్నడూ చూడని ఒక బ్రాహ్మణ బాలుడు భిక్షాటన చేస్తూ, మా ఇంటి సంగతి పూర్తిగా తెలియక అనుకుంటూ, తలుపు తట్టాడు. అతడి ముఖవర్చస్సూ, దేహదారుఢ్యమూ చూస్తే, ఎవరో రాచబిడ్డ వలె ఉన్నాడు.

లోపలికి ఆహ్వానించి, అతడికి మంచి భోజనం పెట్ట బోతే, సున్నితంగా తిరస్కరించాడు. తన కుటుంబం తనకై ఎదురుచూస్తూ ఉంటుందనీ, తానొక్కడే ఆ భోజనం చెయ్యటం భావ్యం కాదనీ చెప్పాడు. భోజన ప్రియత్వం లేని బ్రాహ్మణుని చూసి కొంచెం ఆశ్చర్య పడినా, అతడు ఆ ఊరికి కొత్తగా వచ్చిన కుటుంబంలో భాగమని గుర్తించి, స్వయంపాకానికి కావాల్సిన ముడి సరకులన్నీ మూటగట్టి అతడిని సాగనంపాను. అతగాడి రూపం మాత్రం, నాకు శాస్త్రులుగారు ప్రస్తావించిన గాంధర్వ సౌందర్యాన్ని జ్ఞప్తికి తెచ్చింది.

ఆ తరువాత నేను అనేకమార్లు నా స్నేహితు రాలైన ఆ బ్రాహ్మణ ఇల్లాలి ఇంటికి వెళ్తూ ఉండేదాన్ని. పక్కవాటాలోని కొత్త కుటుంబం గురించి ఎన్నో ఆసక్తికర మైన విషయాలు చెప్పేది ఆ ఇల్లాలు. ఆ వితంతువు యుక్తవయస్కుడైనప్పటికీ తన ఆఖరికొడుకును చిన్న పిల్లాడిలాగా చూసేదనీ, తన ఒళ్లో పడుకోబెట్టుకోవటం, తన చేతులతో అన్నం కలిపి తినిపించటంలాంటివి చేసేదని చెప్పినప్పుడు ఆమె మాతృప్రేమకి కొంచెం ఆశ్చర్యపడ్డా. నాకు ఆ వితంతువునీ, ఆ కుటుంబాన్నీ కలవాలని ఉన్నా, ఆవిడ ఏనాడూ బయటికొచ్చి నాతో మాట కలపకపోవటంవల్ల, వాళ్లతో అస్సలు పరిచయం పెరగలేదు. కానీ, ఆవిడకు నా గురించి తెలిసి ఉంటుం దన్న నమ్మకం మాత్రం నాకుండేది.

నేను పూలతో చేస్తున్న వైద్యాల, మహత్తుల వార్తలు మా ఊరు పొలిమేరలు దాటి చుట్టుపక్కల వున్న పట్టణాల వరకూ వ్యాపించాయి. పట్నంలోని ఒక వణిజుడు నన్ను ప్రత్యేకంగా పిలువనంపి, నేను తిర స్కరించలేనంత సొమ్ము ముందుగానే చెల్లించడంతో, నేను నా ఊరు వదలి కొద్ది నెలలపాటు పట్టణవాసం చెయ్యాల్సి వచ్చింది. రాజ్యంలో కొందరు దుష్టులు చేస్తున్న రాక్షసకార్యాల గురించి ఆనోటా ఈనోటా వింటున్నపుడు నా ఊరి జనం గురించి కొంత బెంగ కలిగినా, వెంటనే తిరిగివెళ్లే వీలు దొరకక చాలా నెలలు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. వచ్చిన పని సవ్యంగా పూర్తి అవడంతో పాటు, ఘోర అరాచకాలు చేస్తున్న దుర్మార్గాల పీడ వదలి, మా ఊరితో బాటు చుట్టుపక్కల గ్రామాలలో మళ్లీ శాంతిభద్రతలు వెలిశాయన్న శుభవార్త విన్న నేను, నిశ్చింతగా మా ఇంటికి తిరిగి చేరుకున్నాను.

నేను ఇంటికి తిరిగొచ్చిన రోజే నా స్నేహితురాలు నా సహాయం కావాలంటూ తన కొడుకు ద్వారా నాకు కబురంపటంతో నేను వారింటికి వెళ్లాను. ఆ ఇల్లాలు తమ పక్క వాటాలో బస చేస్తున్న కుటుంబంలోకి కొత్త కోడలు ఆరోజే వచ్చిందని చెప్పి, నన్ను వాళ్లకు సహాయ పడమని అభ్యర్థించింది. నేనా అభ్యర్థనను అర్థం చేసుకో కుండా తోసిపుచ్చుతాననేమో, ఎంతో హడావిడిగా నేనడ క్కుండానే చెప్పటం ప్రారంభించింది. తమ కుటుం బానికి ఆ పక్కింటివాళ్లు ఎంతో సాయపడ్డారనీ, వారి రుణం తానీ జన్మలో ఏమి చేసినా తీర్చుకోలేననీ చెప్పింది. నేను వివరాలు కనుక్కొనే లోపలే ఆ పక్కిం టావిడ రావటంతో మా సంభాషణకి కళ్లెం పడింది. నేనదే ఆవిడని మొదటిసారి కలవటం. ఆవిడ వితం తువే అయినా, నడివయసు మనిషైనా ఆ విగ్రహంలో ఒక రాజసం ఉట్టిపడుతోంది. ఏ ఉపోద్ఘాతం లేకుండా ఆవిడ నానుంచి ఏమి సహాయం కోరుతోందో మొహ మాటం లేకుండా... ఇంకా చెప్పాలంటే ఒక మహారాణి ఆజ్ఞాపించినట్టు చెప్పింది.

ఆరోజు రాత్రి వాళ్లింట్లో శోభనకార్యం జరగబో తోంది కనక నా ప్రతిభ గురించి విని, కొత్తకోడలిని కార్యానికి తయారుచెయ్యటంలో, శోభనశయ్యాలం కరణలో నా సాయం కోరింది. నేను వారి వాటాలోకి వెళ్లి చూద్దును కదా, ఎక్కడా కళ్యాణఛాయలే కనపడ లేదు సరికదా, ఒకరకమైన స్తబ్దతతో కూడిన వాతా వరణం పేరుకొని ఉంది. మొదట దానిని అలంకరణ లతో పారదోలితేకానీ, కళ్యాణానంతర కార్యాలు శుభ ప్రద మవ్వవనిపించింది. ఆ పెద్ద ఇంటిని అలంకరించా లంటే మామూలు విషయం కాదు. అరటి బోదెలూ, మామిడాకులూ, ఇంకా అనేక రకమైన ఫలపుష్పాలూ, కావాలంటూ ఒక అయిదారుగురు మనుషులను పంపించి నా ఇంటి తోట నుంచి వాటిని తెప్పించమని ఆ కొత్తత్తగారికి చెప్పేశాను. ఆవిడ చిరునవ్వుతో తన కొడుకొక్కడు చాలు అవన్నీ తీసుకురావటానికని చెప్పి అతన్ని పిలవడానికి కాబోలు బయటకు నడచింది. అంత బలశాలి అయిన కొడుకు ఎవరై ఉంటారా? నా ఇంటికి భిక్షాటనకి వచ్చిన సుందరుడా, లేక తల్లి ఇప్పటికీ గారం చేస్తున్న పసి యువకుడా అని ఒక క్షణం ఆలోచనలోపడ్డా. కాని ఆలోచనల్లో మునిగి ఉండ డానికి సమయం కాదు, కొత్త కోడలికి మంగళ స్నానం చేయించి సింగారించాలన్న అత్తగారి మాట గుర్తుకొచ్చి, ఇంటి వెనకవైపునున్న స్నానాలగదివైపు దారి తీశాను. గదిలోనించి నీళ్లచప్పుడు బదులు ఏవో మాటలు మంద్రస్థాయిలో వినిపించసాగాయి. చెవిని గోడ దగ్గరకు ఆనించి విందును కదా, ఏదో పురుష కంఠం!

"నేనా పని చెయ్యలేను. అది ధర్మాతిక్రమణం అవుతుంది".

"ఒక స్త్రీ తనంతట తానుగా సిగ్గువిడచి నీ సాంగత్యాన్ని కోరితే తిరస్కరిస్తున్నావే, అది పురుషధర్మానికి వ్యతిరేకం కాదా?"

"మనిద్దరికి అనువైన సమయందాకా వేచియుంటే నీకూ, నాకూ కూడా ఈ ధర్మసంకటం తప్పుతుంది కదా. నీ మోహావేశాన్ని అంతవరకు ఆపుకోలేవా?"

"అనాదిగా స్త్రీకి మీ మగాళ్లు రాసిన ధర్మచట్రాల్లోనే ఇరుక్కొని నలిగిపోవటం అలవాటైపోయింది. నా కోర్కెనూ, మనసునూ చంపుకుంటాను. నువ్వింక నిశ్చింతగా శెలవు తీసుకో."

'ఔరా, ఈ కాలం పడతులు అంత మాత్రం ఆగలేకపోతిరే,' అని నేనాశ్చర్యపోతున్నంతలో, ఇంద్ర తేజస్సుతో వెలిగిపోతున్న ఒక యువకుడు ఆ స్నానాల గది నుండి బయటకు వచ్చి, గోడచాటు దాక్కున్న నన్ను చూడకుండానే, వేటకు బయల్దేరిన అత్యంత నేర్పరి విలుకాడిలాగా వడిగా వెళ్లిపోయాడు.

నెమ్మదిగా నేను లోపలికి వెళ్లి చూద్దును కదా, అక్కడ ఇంకా స్నానం కూడా మొదలెట్టని కొత్త పెళ్లికూతురు, వివస్త్రగా కూర్చొని ఉంది. రంగుకి నల్లగా వున్నా మంచి అంగసౌష్ఠవంతో, తీర్చిదిద్దినట్టున్న రూపురేఖలతో, ఆడదాన్నైన నేనే చూపు తిప్పుకోలేనంత అందంగా ఉంది ఆ ఆడకూతురు. నేను తన దగ్గరకు వెళ్లగానే, నీళ్లతో నిండిన కన్నులతో నన్ను మౌనంగానే పలకరించింది. నా పూలసుగంధం లాగానే, నా పరిచయం కూడా నా రాకముందే తనకు తెలిసిపోయినట్టుంది! నేను కూడా, ఆ నిశ్శబ్దాన్ని భంగపరచకుండానే, ఆమెకు తలారా స్నానం చేయించటానికి పూనుకున్నాను. పసుపుతో ఆమె శరీరాన్ని లేపనం చేస్తుండగా, తనే నోరు విప్పింది. ఆ స్నానాలగది నుండి బయటకు నడిచినవ్యక్తి తన మనసు దోచుకున్న పురుషుడని, కాని ఆ రాత్రి తన తనువును దోచుకోబోయేది మాత్రం వేరే పురుషుడని!

ఈ కాలంలో కూడా ఒక ఆడబిడ్డకి ఏమి కావాలో తెలుసుకోకుండా తలవంచి పెళ్లి చేసేస్తున్న పెద్దవాళ్ల మూర్ఖత్వం మీద నాకు పట్టరాని కోపం వచ్చింది. అదే సమయంలో బలిపశువులా నా సహాయంతో తయారవుతున్న ఈ పెళ్లికూతురి మీద జాలీ, దయా ముంచుకొచ్చాయి. పెద్దదానిగా నా కర్తవ్యం గుర్తుకొచ్చి, ఆమెను సాంత్వనపరచటానికి ప్రయత్నించసాగాను. పెళ్లయిన స్త్రీ, మనసులో అప్పటివరకూ ఉన్న కోరికలన్నీ చంపుకుని, ఒక తెల్లని వస్త్రంలాంటి మనసుతో కొత్త సంసారం ప్రారంభిస్తేనే, ఆమెకూ, భర్తకూ, ఆ కుటుంబానికి కూడా శ్రేయస్కరమని, శాస్త్రులుగారి కథాకాలక్షేపం నుండి నా కబ్బిన, నాకు ఏమాత్రం వర్తించని, నీతులను వల్లె వేస్తూ ఆమెకు అలంకారం చెయ్యసాగాను.

ఆ పెళ్లికూతురు చెవులకి నా మాటలొక్కటీ ఎక్కినట్లు లేవు. నా నీతులను అర్ధాంతరంగా ఆపించి నన్నో కోరిక కోరింది. నా పూల పరిజ్ఞానమంతా ఉపయోగించి, తన అలంకరణలోనూ, లోపలి శయ్యాలంకరణలోనూ ఏమైనా కొన్ని పువ్వులను వాడి, తనపైనా, ఆ రాత్రికి జరగబోయే శోభనకార్యం పైనా, తన భర్తకు కోరిక కలగకుండా చెయ్యగలవా అని. నా పరిజ్ఞానానికి పరీక్షతో బాటు నన్ను రెండు నిమిషాల పాటు ధర్మసంకటంలో పడేసింది ఆ పిల్ల, తన కోర్కెతో. నేను ఎంతో సంయమనంతో వాడినప్పుడు నాకన్ని విధాలా సహకరించిన ఈ పూలు, నేను ఈ ధర్మ విరుద్ధ కార్యం చెయ్యబూనితే నాతో అదేవిధంగా సహకరిస్తాయా అని కూడా మీమాంసలో పడ్డాను. అయితే నా మేధస్సుని తక్కువ చేసుకుని, లేని గురుత్వాన్ని ఆ పూలకు ఆపాదించి, నా ఆలోచనలతో అనవసరంగా కుస్తీ పడుతున్నానన్న బలమైన భావన కూడా నన్ను కమ్మేసింది. ఆ కొత్త పెళ్లికూతురు మొహంలో తాండవిస్తున్న దైన్యం నా నిశ్చయాన్ని మరింత దృఢపరిచింది. 'అడవిబాదం పూలు' ఎక్కడైనా సంపాదించి ఒకటి, రెండు ఆ పెళ్లికూతురు జడలోను, ఆ పడకపైనా కనక ఉంచితే అవి అన్ని కోరికల్నీ దూరం చేస్తాయి. అవి ఎక్కడ దొరుకుతాయో కూడా నాకు తెలుసు.

అత్తగారు, బయట నా కోసమే, జరిగిన ఆలస్యం వల్ల అనుకుంటా, అసహనంగా ఎదురుచూస్తూ పచార్లు చేస్తున్నారు. ఆమె పంపిన కొడుకు, ఎంత బలశాలో ఏమో మరి, అడిగినవన్నీ ఒక్కడే నా ఇంటి పెరట్లోనించి కోసి, తన భుజాలమీద మోసుకొచ్చి పడేశాడు. నేను ఎక్కడ ఏమి కట్టాలో చెప్తే, చిటికెలో అన్నీ పనులూ చేసేశాడు. శోభనం పెళ్లికొడుకు మాత్రం ఇంటి లోపలి గదిలోనే ఉండిపోవటంతో అతడిని చూసే అవకాశం లేకపోయింది. నేను అదను చూసుకుని బయటకు వెళ్లి నాకు కావాల్సిన పూలు కోసుకొచ్చుకొని చివరిగా శయ్యాలంకరణ ప్రారంభించాను. పగడమల్లెలు ఒక్కటైనా పొరపాటున కూడా పడకుండా, వాసన లేని అనేకరకాల పూలు వాడి శయ్యను అతి సుందరంగా అలంకరించా. అడవి బాదంపూలు మాత్రం మోతాదుకు మించే తగి

లించి బయటపడ్డా. నా ఇంటికి వెళ్లిపోతున్న నన్ను, వెనక నుంచి పిలిచి మరీ గుర్తుచేసింది ఆ అత్తగారు, ఆ మర్నాడు ఉదయం ఒక్కసారి మళ్లీ వచ్చి కలవమని. పూలను చదవగల నాకున్న శక్తిని గురించి తెలిసి నన్ను రమ్మంటోందన్న విషయం అర్థమై, మర్నాడు ఏమి సాకు చెప్పాలా అని విచారిస్తూ ఇంటి తోవ పట్టా.

ఆ మర్నాడు, సూదుల్లా గుచ్చే సూర్యకిరణాలు కానీ, తోటలోని పూల గుబాళింపులుగానీ, కోడి పలు కూతలుగానీ, ఏవీ నన్ను నా మంచం నుండి లేచేందుకు ప్రేరేపించలేకపోయాయి. వస్తానని ఇచ్చిన మాట నిల బెట్టుకోవటం కోసం, అతికష్టం మీద ఎలాగో లేచి ఆ ఇంటికి వెళ్లా. పెళ్లికూతురు కనపడలేదు కానీ, అత్తగారు నన్ను గుమ్మంనించే తోడ్కొని, శోభనం జరిగిన గది లోనికి తీసుకెళ్లారు. ఆ గదినిండా పగడమల్లెల పరి మళాలే. పడకమీద నేను రాత్రి సింగారించిన పూలు అన్నివైపులా చెదిరి అస్తవ్యస్తంగా పడి వున్నాయి. పగడ మల్లెలు నేను వాడకపోయినా, మత్తెక్కించేంతటి సువాసన ఎక్కడి నుంచి వస్తోంది అని నాకే ఆశ్చర్యం వేసింది. ఒక్కొక్క పువ్వును వాసన చూడసాగాను. అన్నిటి లోనూ పగడమల్లెల వాసనే. ఆఖరికి, అడవి బాదం పువ్వుల్లో కూడా అదే పరిమళం! కాగల కార్యాన్ని జరి పించటానికి, నా పూలే పనిగట్టుకుని, నా పరిజ్ఞానాన్ని పరిహసిస్తూ, తమ ఒరవడినే మార్చుకుని ఇలా ప్రవ ర్తించాయా అన్న ఆలోచనలలో మునిగిపోయా!

ఆ పూలు, ఆ భార్యాభర్తలు ఆనందావేశాలతో గడిపిన ఆ తొలిరాత్రి మధుర క్షణాలూ, ఒకరిలో ఒకరు కరిగిపోతూ మమేకమైపోతున్న ఆ దృశ్యాలను నాకు అస్తవ్యస్తంగా గోచరింపచేయసాగాయి. నన్నే చాలా సేపటి నుంచీ గమనిస్తున్న ఆ అత్తగారు, నేను ఏమీ చెప్పకుండానే నా భావాలని చదివేసిన దానిలాగా, ఒక పెద్ద చిరునవ్వుతో, మెచ్చుకోలు చూపుతో నా వైపు చూసి బయటకు నడిచింది. ఆ అయోమయ స్థితిలోనే నేనూ గదినుంచి బయటపడ్డాను. నా కోసమే ఎదురుచూస్తున్న ఆ కొత్తకోడలు నన్ను పక్కకి లాగింది. నా ప్రశ్నార్థకమైన చూపును అర్థం చేసుకుందేమో, ఏమి జరిగిందో చెప్ప సాగింది. గదిలోనికి అడుగుపెట్టిన ఆమెని, ఆ అడవి బాదంపూల వాసన చుట్టేసి చాలా ఇబ్బంది కలగజేస్తు న్నప్పుడు, ఆమె భర్త లోపలికి ప్రవేశించాడు. అతని మొహంలో ఒక తేజస్సు ఉట్టిపడుతోంది నిర్మలమైన మోముతో, చెదరని చిరునవ్వుతో అతడు ఆమెను పలక రించాడు. కుంచించుకుపోయి కూర్చుని ఉన్న ఆమె, అతడి మొహంలోని వెలుగునూ, ప్రశాంతతనూ చూసి కలవరపాటు కొంచెం కోల్పోయినదైనది.

అతడు ఏ మాత్రం తొణకని మృదువైన స్వరంతో, ఆమె మనసులో ఉన్నది తను కాదని తనకు తెలుసు ననీ, కానీ పతిగా తన ధర్మం తను నెరవేర్చటానికి తన కది అడ్డుకాదనీ చెప్పాడు. అంతేకాక, ఆమెకు ఇష్టం లేకుండా ఆమెను తాకే ప్రయత్నం కూడా తను చెయ్య ననీ, అది తన పురుషధర్మానికి వ్యతిరేకమనీ పలికి కూర్చుండిపోయాడు. ఆ సమయాన అతడు భూలోకం లోకి దిగివచ్చిన ధర్మదేవత ప్రతిరూపంలాగా ఆమెకు అగుపడసాగాడు. ఆమెలోని దైన్యం, నిర్లిప్తత ఒక్కసారిగా కరిగిపోనారంభించాయి. అప్రయత్నంగా ఆమె చేతులు అతడి పాదాల్ని స్పృశించాయి. ఆమె అతని శరీరమును తాకినంతనే, శయ్యపైనున్న పూలు తమ ప్రకృతినే మరిచిపోయి పగడమల్లెల సువాసనలు వెదజల్లనారం భించాయి. ఆ వాసనలు ఆమెను ఆవహించి సహ ధర్మ చారిణిగా ఆమె ధర్మాన్ని గుర్తుచేశాయి. ఆ తరువాత కొన్ని గంటలు క్షణాలుగా మారిపోగా, అలసిన ఆ శరీరా లకు నిద్ర ఎప్పుడు పట్టిందో కూడా ఆమె గుర్తించలేదు.

ఆమె చెప్పినది విన్న తరువాత నా రోమాలు నిక్క పొడుచుకున్నాయి. ఇది మానవ మేధస్సుకందని అద్భుత ఘటన అని సరిపెట్టుకుని నా ఇంటివైపు మళ్లాను.

ఇంతకూ నా పేరు చెప్పనేలేదు కదూ, దాని అవ సరం కూడా లేదు. నాలాంటి వాళ్ల కథలకు పురాణ పుటల్లో ఎక్కడా చోటు ఉండదు. కానీ, నేను ఆ రోజు కలిసిన ఆ ఇంటిలోని వ్యక్తులు మాత్రం యుగాయుగా లకి గుర్తుండే విధంగా ఆ పుటల్లో తమ ఇతిహాసాన్ని రాసుకుపోతారనే నమ్మకం నాకుంది. మా చిన్న కుగ్రామ మైన ఏకచక్రపురంలో, కొన్నాళ్లు మజిలీ చేసి వెళ్లిన ఆ కుటుంబం, పాండవవంశానికి చెందినదని, ఆ కొత్త పెళ్లికూతురు పాంచాలదేశ రాకుమారి అని నాకు అనేక సంవత్సరాల దాకా తెలియనే లేదు!

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 14 జులై 2013*

